క్లుప్తంగా

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం


నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


సూపరింటెండెంట్‌కు చెక్కు అందిస్తున్న సుధాకర్‌రెడ్డి రామనిర్మల దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి అక్కిరెడ్డిపాలెం పంచవటి టౌన్‌షిప్‌కు చెందిన టి.సుధాకరరెడ్డి, రామనిర్మల దంపతులు రూ.లక్ష విరాళాన్ని మంగళవారం అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వరాహనరసింహం పాల్గొన్నారు.

అశోక్‌గజపతిరాజుకు సత్కారం


అశోక్‌గజపతిరాజును సత్కరిస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు, వైదికులు

సింహాచలం: గోవా గవర్నర్‌గా నియమితులైన సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజుకు దేవస్థానం వైదికులు, అధికారులు మంగళవారం అభినందనలు తెలిపారు. విజయనగరంలోని ఆయన స్వగృహంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వైదికులు కలిసి, దుశ్శాలువాతో సత్కరించారు. అర్చకులు వేద ఆశీర్వచనమిచ్చి, స్వామివారి ప్రసాదాన్ని అందించారు. కనకమహాలక్ష్మి దేవస్థానం ఏఈఓ హరి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ పెందుర్తి ఇన్‌చార్జిగా విన్నకోట రాము



పెందుర్తి: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా చినముషిడివాడకు చెందిన సీనియర్ నాయకుడు విన్నకోట రాము నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

చినముషిడివాడలో సుపరిపాలనలో తొలి అడుగు


ఇంటింటి ప్రచారంలో బాబ్జి, మేయర్ పీలా

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు, నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పరవాడ: మండలంలోని కలపాక గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కృష్ణారావు తన సిబ్బందితో మంగళవారం ఆకస్మిక దాడులు జరిపారు. ఈ దాడిలో 7గురు పేకాటరాయుళ్ల నుంచి రూ.8,430 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


వేపగుంట బంటా కాలనీలో కార్డన్ సెర్చ్‌లో సీఐ సతీష్‌కుమార్, సిబ్బంది


పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితుడితో సీఐ సతీష్‌కుమార్, సిబ్బంది


పెందుర్తి: నేర ప్రవృత్తి కలిగిన ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరినీ విడిచిపెట్టబోమన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి వేపగుంట సమీపంలోని బంటా కాలనీలో మంగళవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు 20 మంది బృందంతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అడుగడుగునా క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. పత్రాలు సక్రమంగా లేని 20 వాహనాలను సీజ్ చేశారు. కాలనీలో పాన్‌షాప్‌లో మద్యం బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నిల్వ ఉన్న 40 మద్యం క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు, వాహనాల సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చోరీల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడే అంశంలో ప్రజల సహకారమే కీలకమని సూచించారు. రానున్న రోజుల్లో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఎస్‌ఐలు స్వామినాయుడు, దేముడునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి

పెందుర్తి: భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పిలుపునిచ్చారు. పురుషోత్తపురంలోని కంఫర్ట్ హోమ్స్‌లో హెచ్‌పీసీఎల్, జేడీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'స్వచ్ఛత-శుభ్రత-ప్లాస్టిక్ నిషేధం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సదస్సులో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, హెచ్‌పీసీఎల్ సీజీఎం హరిబాబు, అధికారులు, కంఫర్ట్ హోమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం సమగ్రం, విస్తృతం


ఆచార్య సత్యనారాయణకు రాజ్యాంగ ప్రతిని అందించి సత్కరిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం: భారత రాజ్యాంగం మిగిలిన దేశాల రాజ్యాంగాల కంటే భిన్నమైనదని, ఎంతో సమగ్రమైనదని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ(డీఎస్ఎన్ఎల్‌యూ) వ్యవస్థాపక ఉపకులపతి ఆచార్య వై.సత్యనారాయణ తెలిపారు. వర్సిటీలో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన సదస్సులో భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలపై ప్రసంగించారు. భారత రాజ్యాంగం దేశంలోని అనేక జాతులకు, కులాలకు, వర్గాలకు సంబంధించిన హక్కులు, స్వేచ్ఛను పరిరక్షించేందుకు రూపొందించబడిందన్నారు. అందుకే ఏ దేశ రాజ్యాంగంతో పోల్చి చూసినా మన రాజ్యాంగ ప్రత్యేకత కనిపిస్తుందన్నారు. దేశంలో తర్వాత వచ్చిన అనేక చట్టాలకు ఇది ఒక మార్గదర్శకమన్నారు. ఇంతటి విస్తృత రాజ్యాంగాన్ని ఎందుకు స్వీకరించాల్సి వచ్చిందో న్యాయ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు, అకడమిక్ డీన్ సోమా భట్టాచార్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన నైపుణ్యాల దినోత్సవం

పరవాడ: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జీసీడీవో జమీమా మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి 2014లో ఏటా జూలై 15ను ప్రపంచ యువజన నైపుణ్యాల దినంగా జరుపుకోవాలని ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, రోల్ ప్లే పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల హెచ్ఎం గొల్ల రాజేశ్వరి, ఇన్‌చార్జ్ గీత, ఒకేషనల్ కోఆర్డినేటర్లు సుధాకర్, రమేష్, ట్రైనర్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.



వైభవంగా పాదాలమ్మ, బంగారమ్మ పండగ


పాదాలమ్మ


బంగారమ్మ

సింహాచలం: అడవివరంలోని గోశాల లేఅవుట్‌లో కొలువుదీరిన శ్రీ ఉమామహేశ్వరి పాదాలమ్మ, బంగారమ్మ అమ్మవార్ల పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. కాలనీవాసులు, అడవివరం గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవార్లని దర్శించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

గొల్లగుంట శ్మశానవాటిక స్థల పరిశీలన


శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పరవాడ: అచ్యుతాపురం మండలం నడింపల్లి రెవెన్యూ పరిధి రావాడ శివారు గొల్లగుంట శ్మశానవాటిక స్థలాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. సదరు శ్మశానవాటిక స్థలానికి హద్దులు నిర్ణయించి, తమకు అప్పగించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు గ్రామస్తులు ఇటీవల పరవాడలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో విన్నవించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శ్మశానవాటిక స్థలాన్ని నునపర్తి వీఆర్వో వెంకట్, సచివాలయ సర్వేయర్ గణేష్ పరిశీలించారు. నివేదికను త్వరలో జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. గొల్లగుంట ప్రజలు తమవారి అంత్యక్రియలకు వీలుగా ఏర్పాటు చేసిన శ్మశానవాటిక స్థలం వేరే మండల పరిధిలో ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో హద్దులు నిర్ణయించి, తమకు అప్పగించాల్సిందిగా మొరపెట్టుకున్నారు. నివేదికను అధికారులకు నిర్ణీత సమయంలో అందించి, సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు రెవెన్యూ అధికారులను కోరారు. ఈ పరిశీలనలో గొల్లగుంట గ్రామ పెద్దలు షేక్ ఆలీ, నడింపల్లి వీఆర్వో నూకరాజు, అక్బర్‌ఆలీ, మదీనా, అజహరుద్దీన్ పాల్గొన్నారు.

సబ్బవరం కేజీబీవీకి సామగ్రి అందజేత


కేజీబీవీకి అందించిన రైస్ బ్యాగ్‌లు, ఫ్రీజర్

సబ్బవరం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాని(కేజీబీవీ)కి అవసరమైన వస్తువులు, నిత్యావసర సరకులను ప్రభుత్వం అందించినట్లు విద్యాలయ ప్రత్యేక అధికారి మృదుల తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు సన్న బియ్యం, వారు నిద్రించేందుకు అవసరమైన పరుపులు, వంటి గదిలో ఆహార పదార్థాల నిల్వకు వీలుగా ఫ్రిడ్జి, వేయింగ్ మిషన్, పిండి మిల్లు, మిక్సీ, వంటపాత్రలు వచ్చాయన్నారు. స్టాఫ్ రూమ్ ఏర్పాటుకు ఎంపీ నిధులు రూ.5 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. వంటశాలలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని, ప్రత్యామ్నాయంగా రోటీ మేకర్ వంటి పరకరాలు ఉంటే ఉన్నవారికి పనిభారం కొంత తగ్గుతుందన్నారు. పాఠశాలలో కంప్యూటర్ అవసరమని దాతలు ముందుకు వచ్చి రూ.1 లక్ష వరకూ సాయం చేస్తే ఈ రెండు అవసరాలు తీరుతాయన్నారు.

మండపాల వేలంపాట నిలుపుదలకు డిమాండ్

సింహాచలం: సింహగిరిపై వివాహాలు చేసుకునేందుకు వీలుగా డెకరేషన్ మండపాల నిర్వహణపై దేవస్థానం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని విశ్వహిందూ పరిషత్ ఆరోపించింది. మండపాల నిర్వహణను బహిరంగ వేలం ద్వారా కేటాయించేందుకు దేవస్థానం పూనుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు విశ్వహిందూ పరిషత్ నాయకుడు పూడిపెద్ది శర్మ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఇప్పటి వరకు సింహగిరిపై వివాహాలు చేసుకునే బృందాలకు డెకరేషన్ మండపాలను కాంట్రాక్టర్ అధిక ధరలకు ఇవ్వడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దాంతో వేలం ప్రక్రియను నిలిపివేయాలని ఆరు నెలల క్రితం తాము ఆమరణ నిరాహార దీక్ష చేయడంతో దేవస్థానం ఈవో ఆదేశాలతో ఏఈవో ఆనంద్ కుమార్ వచ్చి దీక్ష విరమింపజేశారన్నారు. ఐదు మండపాలు దేవస్థానమే ఉచితంగా ఇస్తుందని, అవసరం అయితే ఆ సంఖ్య మరింతగా పెంచుతామని, గజపతి సత్రం వెనుక, కాటేజీల వద్ద ఎలాంటి మండపాలు వేయడం జరగదని హామీ ఇచ్చారన్నారు. వాటిని కాదని ఇప్పుడు కొత్తగా మండపాల నిర్వహణ వేలంపాటకు దేవస్థానం సన్నద్ధమడం ఆక్షేపణీయమన్నారు. ఆధ్యాత్మిక సంఘాలు ఉచితంగా డెకరేషన్ మండపాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భక్తుల మనోభావాలని దెబ్బతీసే చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం


విద్యార్థులతో సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: యుక్త వయసులో మద్యం, మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. చినముషిడివాడ కేకేఆర్ గౌతమ్ పాఠశాలలో మంగళవారం 'విద్యార్థి భద్రత'అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ టీనేజీలో మంచి-చెడులపై తగిన అవగాహన పెంచుకోవాలన్నారు. మద్యం, డ్రగ్స్, ఇతర చెడు అలవాట్లకు బానిసలైతే కుటుంబాలకు కూడా తలవంపులు వస్తాయన్నారు. బాలికలను వేధిస్తే చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పట్టుదల క్రమశిక్షణతో చదువుకుని ప్రతి విద్యార్థి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను సీఐ నివృత్తి చేశారు. పాఠశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి పరీక్షలు జరుపుతున్న డాక్టర్ వివేక్‌వర్మ

పరవాడ: మండలంలోనివాడచీపురుపల్లి గ్రామంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందిస్తున్న ట్రస్ట్ బృందాన్ని పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు అభినందించారు. శిబిరంలో 106 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణుడు డాక్టర్ పి.వివేక్ వర్మ కంటి పరీక్షలు జరిపి, వైద్య సేవలు అందించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన 32 మంది రోగులను ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్, నర్సింగ్ సిబ్బంది అమృత వర్షిణి, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ బృందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పలువురికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్‌లను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం పంపిణీ చేశారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పొంతపల్లి శివకుమార్(ఆర్ఆర్ వెంకటాపురం), గిండుగు గోవింద్(నాయుడుతోట), తరసలా అప్పలనర్సమ్మ(లంకెలపాలెం), మోటూరు వినాయక రామసత్య అరుణ (రావాడ-పరవాడ)లకు మంజూరైన నిధుల మేరకు చెక్కులు అందించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబును రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కింజారపు ప్రభాకర్, ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈగా బాధ్యతలు తీసుకున్న బి.సింహాచలంనాయుడు, సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య దాసరి సూర్యప్రకాశరావులు మర్యాదపూర్వకంగా కలిశారు.